క్లుప్తంగా

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని కోరుతూ జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్. నాగసుబ్బారెడ్డి, బీ.మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం ప్రధానమంత్రి మోదీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలకు సమ్మె ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, శ్రీని వాసులు రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా, నగర కార్య దర్శి మద్దిలేటి, సీఐటీయూ జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



వితరణగా ఇచ్చిన పుస్తకాలతో గ్రంథాలయ సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: తాడిపత్రి పట్టణానికి చెందిన జి శివమ్మ ఐదు వందల పుస్తకాలను మంగళవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి, సహాయకులు ఎన్. రమేష్ రావు, ఎం. మౌనిక లకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన గ్రంథాల్లో తెలుగు వ్యాకరణ చంద్రిక, బృహదారణ్యకోపనిషత్, అమరకోశం, వేదాల వెలుగు, అన్నమాచార్య సంకీర్తనామృతం, హిందూ సంస్కృతి, ఐతరేయోపనిషత్, శ్రీకృష్ణ శతకం, మహాభారత వైభవం, బాల రామాయణం, శ్రీ లక్ష్మి నిధి లాంటి పలు విలువైన గ్రంథాలు ఉన్నాయన్నారు. పుస్తకాలను బహూకరించిన శివమ్మ, విజయదుర్గమ్మ ఆలయ మేనేజర్ మండల రామకృష్ణ, గజ్జల వినోద్ రెడ్డి, ఎ. అనిల్ కుమార్‌లను అభినందించారు.

ఆ కళాశాలను మూసివేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రొద్దుటూరు పట్టణంలోని ఫేస్ కళాశాల ఇంటర్మీడియట్ విద్య, విధానాలకు వ్యతిరేకంగా, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, ఆ కళాశాలను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం ఆర్ఐవో సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలోని ఫేస్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రధానంగా ఫేస్ కళాశాల ఇంటర్మీడియట్ గుర్తింపు ఉన్నప్పటికీ ఐఐటి, మెడికల్ అకాడమీ పేర్లతో కళాశాలను నిర్వహిస్తున్నారన్నారు. అక్కడ చదివే విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంపల్లి అజయ్, నాయకులు శీను పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరం రామాంజనేయ పురంలో 424/4సి, 425 సర్వే నెంబర్లలో ఉన్న కాలువను పూడ్చి వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన బాలాజీ డెవలపర్స్ యాజమాన్యం మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలాజీ డెవలపర్స్ యాజమాన్యం అనాదిగా వస్తున్న వంకను మూసివేసి నీటిని కిందికి ప్రవాహం లేకుండా చేశారని ఆరోపించారు. అధికార పార్టీ నేతలు కాలువకు అడ్డంగా కట్టిన గోడను తొలగించినా మళ్లీ ఆ కాలువకు అడ్డంగా గోడ నిర్మించారన్నారు. బాలాజీ డెవలపర్స్ యాజమాన్యంనకు కార్పొరేషన్ అధికారులు ఏ రకంగా అనుమతులు మంజూరు చేశారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసులురెడ్డి, చంద్రారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

భూసారాన్ని సంరక్షించాలి

వీరపునాయునిపల్లె : భూసారాన్ని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆశించిన స్థాయిలో పంటలు దిగుబడులు రాకపోవడానికి ప్రధాన కారణం భూసారం తగ్గిపోవడమేనన్నారు.



పైపులైన్ లీకేజీ

కడప నగరం రామాంజనేయపురంలో రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా కడప నగరానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. గతంలో ఇక్కడ పైపులైన్ లీకవుతుంటే మరమ్మతులు చేశారు. కానీ అది మళ్లీ లీకేజీ అవుతూ ఉంది. లీకవుతున్న నీరు కడప–తిరుపతి రోడ్డులో పారుతున్నాయి. దీని వల్ల రోడ్డుకూడా పాడయ్యే అవకాశం ఉంది. లీకేజీని అరికట్టి తాగునీరు వృథా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. – కడప కార్పొరేషన్

వరిలో కాలిబాటలకు ప్రాధాన్యం

మైదుకూరు: వరి పంట సాగులో కాలిబాటలకు ప్రాధాన్యం ఇవ్వాలని మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కృష్ణమూర్తి అన్నారు. మైదుకూరు పరిధిలోని లింగాలదిన్నె, గడ్డమాయపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ వరిలో విత్తనాల ఎంపిక, నారు మడి యాజమాన్యం, వరి నాట్లు, కాలిబాటల ప్రాముఖ్యత గురించి, వివిధ రకాల ఎరువుల గురించి, తెగుళ్ల పురుగు మందుల వినియోగం గురించి తెలిపారు. ఏఓ బాలగంగాధర్ రెడ్డి , కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా పేర్కొన్నారు. మంగళవారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువతపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకుని నడుచుకోవాలని సూచించారు. దీంతోపాటు పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ – 112, రహదారి భద్రత, సోషల్ మీడియా – సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియ చేశారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఈదురుబాషా

వేతనాలు పెంచాలని వినతి

కడప ఎడ్యుకేషన్: మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు సంబంధించిన జీతాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని ఎంఐఎస్ జిల్లా ప్రెసిడెంట్ అరవిందబాబు కోరారు. ఈ విషయమై మంగళవారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021వ సంవత్సరంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు విధుల్లో చేరి విద్యా వ్యవస్థకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ప్రధాన పాత్ర ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు పోషిస్తున్నా జీతాలు మాత్రం ప్రభుత్వం తక్కువగా ఇస్తోందన్నారు. ప్రస్తుత జీవన విధానంలో జీతాలు సరిపోవడం లేదని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి జీతాలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్‌తోపాటు పలువురు ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం

వల్లూరు : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధుల కలిసి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యా శాఖ అధికారులు వెంకటేశాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని గోటూరు పాఠశాలకు కలిపారని, కనీసం ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కూడా కల్పించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గోటూరు ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు పాఠశాలకు హాజరు కావడం కష్టంగా మారుతోందని, దీని వలన తల్లికి వందనం లబ్ధి అందకపోయే అవకాశం వుందని విద్యాశాఖ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. 108 వాహనాలకు సరైన పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గతంలో తమ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం ఇంకుడు గుంతలు మంజూరు చేయగా నిర్మించుకున్నారని, ప్రస్తుతం వాటిని వినియోగించుకోకుండా వీధుల్లోకి బాత్‌రూమ్‌ల నీరు వదులుతుండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంబవరం గ్రామ సర్పంచ్ ఓబుల్ తెలిపారు. ఇంకుడు గుంతలు మంజూరైన లబ్ధిదారుల జాబితా అధారంగా వాటిని ఉపయోగించుకుని మురుగు నీరు వీధుల్లోకి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీటి మోటారు వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రఘురాం

ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్: కడప కాగితాలపెంట ఐటిఐ సర్కిల్‌లోని ప్రభుత్వ డిఎల్‌టిసి/ఐటిఐలో 2025 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ రత్నరాజు తెలిపారు. ఇంటర్ ఫెయిలల్ అయిన, డ్రాప్ అయిన వారితోపాటు పదవ తరగతి పాస్ లేక ఫెయిల్ అయిన విద్యార్థినీ, విద్యార్థులు ఐటీఐలో చేరవచ్చని తెలిపారు. విద్యార్థులు తమకు సంబంధించిన ఎస్ఎస్‌సి మార్కులిస్టు, క్యాస్టు సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతోపాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రెండు పాస్ పోస్టు సైజు ఫోటోలు, ఆధార్ లింక్ ఫోన్ నెంబర్ , మెయిల్ ఐడితో కడప సర్కిల్ వద్ద ఉన్న డిఎల్‌టిసి/ఐటిఐ ఆఫీసులో సంప్రదించాలని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ వసతి సౌకర్యం ఉందన్నారు. అడ్మిషన్ల వివరాలకు 90147 88255, 85559 58200 నెంబర్లను సంప్రదించాలన్నారు .

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

పులివెందుల రూరల్ : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ధ్యేయమని జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని అచ్చివెళ్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేడీఏ పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రతి పథకం లబ్ధి పొందేలా అవగాహన కల్పించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి నగదు బిల్లు పొంది భద్రపరుచుకోవాలన్నారు. అలాగే ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది పంట సాగు చేయాలని సూచించారు. కంది పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా కందుల మినీ కిట్స్ అందిస్తోందన్నారు. అనంతరం రైతులకు కంది పంట సాగు చేసే రైతులకు కందుల మినీ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ చెన్నారెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

పదోన్నతులు కల్పించి బదిలీ చేయాలి

వేంపల్లె : పదోన్నతులు కల్పించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుడు కృష్ణారెడ్డి, కొత్తూరు కిరణ్‌లు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 5ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ధర్నా చేపట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. అలాగే ఎంపీడీఓ కుళాయమ్మకు, తహసీల్దార్ హరినాథరెడ్డిలకు సచివాలయ ఉద్యోగులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు సీనియారిటీ, రోస్టర్ జాబితా మేరకు ప్రమోషన్స్ కల్పించిన తర్వాతనే బదిలీలు చేయాలని కోరారు. బదిలీలకు సంబంధించి జారీ చేసిన జీఓ 5ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమెండ్ చేసి విద్యార్హతను బట్టి ఉద్యోగన్నతులు కల్పించాలని కోరారు. అలాగే అందరికీ నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరయ్యే విధంగా చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న రికార్డు అసిస్టెంట్ పే స్కేల్‌ను జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌గా వర్తింపజేయాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లోగా స్పష్టత ఇవ్వకపోతే ఉద్యోగులు పెన్–డౌన్, సమ్మె వంటి శాంతియుత నిరసన చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డు సెక్రటరీలు, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రొద్దుటూరు: ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పది గంటల పని విధానం అమలుచేయడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల వేతనాలను జీఓ–36 ప్రకారం రూ.24,500 ఇవ్వాలన్నారు. ఆప్కాస్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, 17 రోజుల సమ్మెకాల ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న సమ్మెకు పిలుపునిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌రెడ్డి, వెంకటేష్, బాలాజీ, భాస్కర్, ప్రమీలమ్మ, ఓబుళమ్మ, శివప్రసాద్, చంటి, శ్రీనివాసులు, సాల్మన్, రాఘువ, గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కమలాపురం : తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని పుట్లంపల్లె, మీరాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, మినుము పంటలపై అవగాహన కల్పించారు. పంటలు సాగు చేసే రైతులు ముందుగా భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. భూసార పరీక్షల వలన తగిన మోతాదులో ఎరువులు వాడవచ్చని, తద్వారా సాగు ఖర్చులు తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. రైతులు వాడే రసాయనిక ఎరువులలో ముఖ్యంగా సూటి ఎరువుల మీద పూర్తిగా ఆధారపడి సాగు చేయడం వల్ల నేలలో సూక్ష్మ పోషకాల పరిమాణం క్రమంగా క్షీణిస్తున్నాయని తెలియజేశారు. సూక్ష్మ పోషకాల లోప లక్షణాలు పంటపై కనిపించక ముందే దిగుబడిని తగ్గిస్తాయన్నారు. పంటలు ఎదగడానికి అభివృద్ధి మంచి ఉత్పత్తి కోసం మొక్కలకు అవసరమైన అన్ని పోషకాలను సమతుల్యంగా అందించాలన్నారు. సూక్ష్మ పోషకాలైన జింకు, ఇనుము, బోరాన్ లోపాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలియజేశారు. పచ్చిరొట్ట ఎరువులు వాడటం వలన సూక్ష్మ పోషక లోపం తగ్గుతాయన్నారు. వరి నాటునప్పుడు నారు కొనలు తుంచి నాటాలని సూచించారు. ప్రతి రెండు మీటర్లకు 30 సెం.మీ. దూరం కాలిబాటలు తీసుకోవాలన్నారు. మేలైన రకాల విత్తనాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. పీఎం కిసాన్ కొరకు లింక్ లేని వారు బ్యాంకులకు వెళ్లి ఎన్‌సీపీఐ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ఇందిరా, శివ రంజని, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ



జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న ప్రజలు

ముగిసిన జాతర

సుండుపల్లె : మండల పరిధిలోని బండకాడ ఈడిగపల్లె గ్రామంలో వెలసిన నాగారపమ్మ మూడవ వారం జాతరను అన్నమయ్య జిల్లా డీజే ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసుకుని, రాత్రి సమయంలో చాందినీబండ్లు ఏర్పాటు చేసి జబర్దస్త్ టీం వారిచే ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని నిర్వహించి అంగరంగ వైభవంగా జాతర మహోత్సవాన్ని జరిపారు. మండల ప్రజలే కాకుండా జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరానికి హాజరైన రోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేద వర్గాలకోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఫాతిమా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సెక్రటరీ ఏక్యూ జవ్వాద్, ఈడీ సల్మాన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఒంటిమిట్ట ఉర్దూ స్కూలు ఆవరణలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కంటి సమస్యలకు వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట, మాధవరం పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 210 మందికి పైగా రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా ఆస్పత్రి వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

దేశంలో నియంతృత్వ పాలన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలోని ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తూ ప్రజా కంటక పాలన కొనసాగిస్తోందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ విమర్శించారు. మంగళవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని మతాల చిచ్చుతో విభజించిన ప్రధాని మోదీ దుష్ట పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పాకిస్తాన్ ను యుద్ధంలో పూర్తిగా తుడిచిపెడతామని ప్రగల్భాలు పలికే ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరికలతో ఆపరేషన్స్ ఆపివేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయానర్హమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.


నిబంధనలు పాటిస్తూ గదులు కేటాయించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులోని గదుల విషయంగా ఉన్నతాధికారులు పేద బడుగు బలహీన వర్గాలకు తగిన న్యాయం చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ రాయలసీమ డివిజనల్ ఇన్‌ఛార్జి కమాల్‌బాష కోరారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండులోని గదుల విషయంగా టెండరు వేసిన వారికి నియమ నిబంధనలు పాటిస్తూ గదులను కేటాయించాల్సి ఉందన్నారు. అయితే కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తీరుతో పలువురు టెండరుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రవంతి అనే దళిత యువతికి షాపు కేటాయించకుండా, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఆదేశాలు బేఖాతరు చేసేలా వ్యవహరించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. అలాగే జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో సైతం ఇలాంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయన్నారు. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్న షాపుల నిర్వాహకులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి. ప్రవంతి, ఎస్.కదిరున్, భాగ్యమ్మ జోసెఫ్ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ కట్టడి చేయడంలో విద్యాశాఖ విఫలం

కడప ఎడ్యుకేషన్: కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంతో విద్యాశాఖ విఫలమయిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న ఆరోపించారు. ఇందుకు నిరసనగా మంగళవారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ జిల్లా పరిధిలోని కడప నగరం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, మైదుకూరు, కమలాపురం, పులివెందుల ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫమయ్యారన్నారు. చాలా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్ విక్రయిస్తున్నా ఎలాంటి చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆకస్మిక నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈఓ షంషుద్దీన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్, నాయకులు మహేష్, శ్రీను, శివ, యశ్వంత్, కార్తీక్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దు



మాట్లాడుతున్న సీఐ నరేష్‌బాబు

జమ్మలమడుగు : విద్యార్థులు చదువుకునే వయసులో మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జూనియర్ కాలేజీ విద్యార్థులకు మత్తు పదార్థాలు, ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చాలా మంది సెల్‌ఫోన్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఫోన్‌లో ఉన్న యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారని తద్వారా జరిగే అనర్థాలు కుటుంబాలను రోడ్డున పడేస్తాయన్నారు. ప్రస్తుతం ఎక్కువ మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు అవుతున్నారన్నారు. ఎక్కడైనా ఈవ్‌టీజింగ్ వంటివి జరిగితే వెంటనే 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ త్రివిక్రమ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ గోపికృష్ణ, డాక్టర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.